## జనగణనలో సెల్ఫ్ ఎన్యూమరేషన్ ప్రారంభించిన మంత్రి పొన్నం

**హైదరాబాద్, ఏప్రిల్ 26, ప్రభాతవార్త:** జనగణనలో భాగంగా మినిస్టర్ క్వార్టర్స్‌లో ఆదివారం రవాణా, బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ సెల్ఫ్ ఎన్యూమరేషన్ ప్రారంభించారు. అధికారుల సమక్షంలో ప్రజలంతా సెల్ఫ్ ఎన్యూమరేషన్ చేసుకోవాలని మంత్రి పొన్నం ప్రభాకర్ సూచించారు. మంత్రి మాట్లాడుతూ.. దేశవ్యాప్తంగా జాతీయ జనగణన ప్రారంభమైందన్నారు. ఆదివారం తెలంగాణలోనూ ప్రారంభమైనందున ప్రతి పౌరుడు సెల్ఫ్ ఎన్యూమరేషన్ చేసుకోవడం వల్ల తమ కుటుంబ వివరాలు దేశజనాభా లెక్కల్లో చూపెట్టాలన్నారు. ప్రజాస్వామ్య విధానంలో ఎవరు ఎంత ఏమిటి అన్న దానిపై జనాభా లెక్కలు 2027లో భాగంగా సెల్ఫ్ ఎన్యూమరేషన్ జాప్యం జరగకుండా తెలంగాణ దేశంలోనే పారదర్శకంగా నం.1గా ఉండేవిధంగా సెల్ఫ్ ఎన్యూమరేషన్ చేసుకోవాలని మంత్రి ప్రజలను కోరారు.

## ఆర్టీసీ సమస్యలు పరిష్కరించినందుకు మంత్రి పొన్నంకు జెఎసి నేతల ధన్యవాదాలు

**హైదరాబాద్, ఏప్రిల్ 26, ప్రభాతవార్త:** రాష్ట్రంలో మూడురోజులపాటు కొనసాగిన ఆర్టీసీ కార్మికుల సమ్మెను పరిష్కరించిన రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్‌కి ఆర్టీసీ జేఏసీ ధన్యావాదాలు తెలిపింది. ఆర్టీసీ కార్మికుల సమస్యలు పరిష్కరించేలా ప్రభుత్వం చర్చలు జరిపి చరిత్రాత్మక నిర్ణయం తీసుకున్న నేపథ్యంలో రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్‌ని సత్కరించిన జేఏసీ ధన్యవాదాలు తెలిపింది. ఆదివారం ఆర్టీసీ జేఏసీ నేతలు మంత్రి నివా సంలో కలిసి.. కార్మికుల చిరకాల స్వప్నం నెరవేర్చడంతో ఆర్టీసీని ప్రభు త్వంలో విలీనం చేయడం, కార్మికులకు గుర్తింపు సంఘాల ఎన్నికల నిర్వహణ, కార్మికులకు 11 శాతం పీఆర్‌సీ ప్రకటించడంతో హర్షం వ్యక్తం చేస్తూ మంత్రి పొన్నం ప్రభాకర్‌కి జేఏసీ నాయకులు ధన్యవాదాలు తెలిపారు. ఆర్టీసీ కార్మిక సంఘాల జేఏసీ నేతలు ఈదురు వెంకన్న, థామస్‌రెడ్డి, అశ్వద్ధామ రెడ్డి, హనుమంతు ముదిరాజ్‌తోపాటు ఇతర సంఘాల నేతలు మంత్రికి ధన్యవాదాలు తెలిపారు. ప్రభుత్వం తీసుకున్న చారిత్రాత్మక నిర్ణయంతో ప్రజా రవాణాను మరింత బలపరిచేలా ఉత్సాహంతో కార్మికులు పనిచేయాలని మంత్రి పొన్నం ప్రభాకర్ ఆర్టీసీ కార్మిక సంఘాల నేతలకు సూచించారు.

## క్రీడా కోటా నిధులను పెంచండి

### కేంద్రానికి మంత్రి వాకిటి శ్రీహరి వినతి

### శ్రీనగర్‌లో ఖేలో ఇండియా చింతన్ శివిర్‌లో పాల్గొన్న మంత్రి

**హైదరాబాద్, ఏప్రిల్ 26, ప్రభాతవార్త :** కేంద్రం ప్రతిష్టాత్మకంగా అమలు చేస్తున్న ఖేలో ఇండియా కార్యక్రమం కింద తెలంగాణకు అధిక నిధులు కేటాయించాలని కేంద్రమంత్రి మన్సుఖ్ మాండవీయను రాష్ట్ర క్రీడలశాఖ మంత్రి వాకిటి శ్రీహరి కోరారు. క్రీడల అభివృద్ధి కోసం కేంద్రం ఏ నిర్ణయం తీసుకున్న తెలంగాణ ప్రభుత్వం మద్దతుగా నిలుస్తుందని కేంద్రానికి తెలిపారు. ఈ మేరకు జమ్మూకశ్మీర్‌లోని శ్రీనగర్‌లో మూడు రోజులపాటు జరిగిన ఖేలో ఇండియా చింతన్ శివిర్ కార్యక్రమంలో ఆదివారం ఆయన పాల్గొన్నారు. ఇప్పటికే క్రీడల అభివృద్ధి కోసం ప్రజా ప్రభుత్వం ప్రత్యేక పాలసీ తీసుకొచ్చి ముందుకు సాగుతుందని వివరించారు. కాగా..క్రీడల్లో భారత్‌ను ప్రపంచంలో అగ్రగామిగా నిలపాలని చింతన్ శివిర్ నిర్ణయించింది.క్రీడలకు సంబంధించి కీలక నిర్ణయాలను శివిర్‌లో తీసుకున్నారు. కేంద్ర, రాష్ట్రాల సమన్వయంతో క్రీడల అభివృద్ధికి కృషి చేయాలని సంకల్ప పత్రాన్ని విడుదల చేశారు. ఈ కార్యక్రమంలో మంత్రితోపాటు రాష్ట్ర ప్రభుత్వ సలహాదారులు ఏపీ జితేందర్‌రెడ్డి, స్పోర్ట్స్ అథారిటీ చైర్మన్ శివసేనారెడ్డి, స్పోర్ట్స్ అథారిటీ సోనీ బాలాదేవి తదితరులు పాల్గొన్నారు.

## సైబర్ నేరగాళ్ల భరతం పట్టేందుకు టిజిసిఎస్‌బి ఆపరేషన్ క్రాక్‌డౌన్-2

### రాష్ట్రవ్యాప్తంగా వివరాల సేకరణ

**హైదరాబాద్, ఏప్రిల్ 26, ప్రభాతవార్త:** రాష్ట్రంలో సైబర్ నేరాలను పూర్తిగా నివారించే లక్ష్యంతో పనిచేస్తున్న తెలంగాణ సైబర్ సెక్యూరిటీ బ్యూరో (టిజిసిఎస్‌బి) మరోసారి ఆపరేషన్ క్రాక్‌డౌన్ 2 పేరిట రాష్ట్ర వ్యాప్తంగా గతంలో అరెస్టయిన సైబర్ నేరగాళ్ల వివరాలను సేకరించింది. శనివారం ఉదయం ఎనిమిది గంటల నుంచి మొదలైన ఈ ఆపరేషన్ క్రాక్‌డౌన్ 2లో టిజిసిఎస్‌బి అధికారులతో పాటు ఆయా ప్రాంతాలలోని శాంతి భద్రతల పోలీసులు పాల్గొన్నారు. రాత్రి బాగా పొద్దుపోయే వరకు సాగిన ఈ దాడుల్లో 2024 నుంచి 2025 వరకు రాష్ట్రంలో అరెస్టయిన 614 మంది గు రించి ఆరా తీశారు. వీరంతా ఇప్పుడు ఎక్కడ వున్నారు...? ఏం చేస్తున్నారు...? నేర ప్రవృత్తిని వీడారా...? లేదా అందులోనే కొనసాగుతున్నారా ...? వీరి ఆదాయ వనరులు ఏమిటీ...? కుటుంబాలను ఎలా పోషిస్తున్నారు...? ఏం ఉద్యోగాలు చేస్తున్నారు...? వీరి సహచరులు ఎవరైనా నేర ప్రవృత్తిలో వున్నారా...? అనే అంశాలపై పోలీసులు వివరాలు సేకరించారు. పోలీసుల సోదాల్లో 335 మంది నేరగాళ్ల వివరాలు మాత్రమే లభ్యమ య్యాయి.

వీరు తెలంగాణలో 480 కేసులు, దేశ వ్యాప్తంగా 1,233 కేసుల్లో నిందితులుగా వుండడంతో వీరిపై కఠిన నిఘా వుంచారు. వీరిలో 218 మంది ఎక్కడ వున్నారనేది పోలీసులు గుర్తించగా 115 మంది ఆచూకీ లభ్యం కాలేదు. వీరి కోసం గాలిస్తున్నారు. ముగ్గురు నేరగాళ్లుగానే వు న్నట్లు తేలింది. పోలీసుల తనిఖీలో ప్రసాద్ కుమార్ అనే నిందితుడు నేపాల్‌లో వుంటున్నట్లు తేలింది. గతంలో ఇతను సికింద్రాబాద్‌లో ఒక హో టళ్లో పనిచేసేవాడు. కాగా 2024. 2025 మధ్య కాలంలో టిజిసిఎస్‌బి దేశ వ్యాప్తంగా 3567 మంది నేరగాళ్లను అరెస్టు చేయగా వీరిలో 614 మంది తెలంగాణకు చెందిన వారున్నారు. వీరిలో 269 మంది మ్యూల్ ఖాతాదారులు, 155 మంది ఏజెం ట్లు, 36 మంది సిఎస్‌ఎం నేరగాళ్లు. ఎనిమిది మంది సైబర్ స్లావరీ నేరగాళ్లు, ఆరుగురు నకిలీ పేర్లతో సిం కార్డులు సరఫరా చేసే డీలర్లు, ముగ్గురు కాల్ సెంటర్ ఉద్యోగులు, ముగ్గురు బ్యాంకు ఉద్యోగులు, నాన్ ఫైనాన్స్ కింద పట్టుబడ్డ వారు 134 మంది వున్నారు. సైబర్ నేరగాళ్లపై నిరంతర పర్యవేక్షణ వుంటుందని, వారిపై ఉక్కుపాదం మోపుతూనే వుంటామని టిజిసిఎస్‌బి డైరక్టర్ శిఖా గోయల్ ఆదివారం నాడు మీడియాకు వెల్లడించారు.

## దాదాసాహెబ్ ఫాల్కే ఫిల్మ్ ఫెస్టివల్‌కు తెలుగు షార్ట్‌ఫిల్మ్ ఎంపిక

**హైదరాబాద్, ఏప్రిల్ 26, ప్రభాతవార్త :** తెలుగు షార్ట్ ఫిల్మ్ ది 3వ పేరు కలిగిన చిత్రం దాదాసాహెబ్ ఫాల్కే ఫిల్మ్ ఫెస్టివల్-2026కి ఎంపికైంది. ఈ ది 3వ అనే తెలుగు లఘు చిత్రం కేప ముని సురేష్ పిళ్ళై దర్శకత్వం వహించారు. ఈ చిత్రం న్యూటన్ మూడవ గమన నియమం నుండి ప్రేరణ పొందిన కథనం ద్వారా విద్యాపరమైన ఒత్తిడిని అన్వేషించడంలో కీలకంగా రూపుదిద్దుకుంది. తెలుగు లఘుచిత్రం ఈ నెల 30న న్యూఢిల్లీలో జరగనున్న 16వ దాదాసాహెబ్ ఫాల్కే ఫిల్మ్ ఫెస్టివల్ 2026లో అధికారికంగా ప్రదర్శన కోసం ఎంపిక అయింది. న్యూటన్ మూడవ గమన ప్రకారం ఈ చిత్రం, ర్యాంకులు మరియు పనితీరు కొలమానాల కోసం విద్యా సంస్థలు విద్యార్థులపై మోపే తీవ్రమైన విద్యా ఒత్తిడి గురించి ఆలోచింపజేసే కథనాన్ని అందిస్తుంది. ఆదర్శిని చిత్ర బ్యానర్‌పై భారతమ్మ నిర్మించిన ఈ చిత్రానికి సినిమాటోగ్రఫీ, ఎడిటింగ్ ఆదర్శిని భారతికృష్ణ. నటీనటులు ఆదర్శిని శ్రీ, ఒబ్బు ప్రసాద్, ప్రొఫెసర్ సూరవజ్జుల రాము, పెమ్మరాజు విజయరామచంద్ర, డాక్టర్ కిరణ్ కుమార్, బాలమురళి తదితరులున్నారు. ముఖ్యంగా సురేష్ పిళ్ళై ఈ ప్రాజెక్ట్‌కు కథ, స్క్రీన్‌ప్లే, సంభాషణలు, పాటలు, దర్శకత్వంతో సహా పలు సృజనాత్మక బాధ్యతలను చేపట్టారు. ఈ ప్రతిష్టాత్మక ఉత్సవానికి ది 3వ ఎంపిక కావడం, దాని బలమైన ఇతివృత్త ప్రాసంగికత, సినిమాటిక్ ఆకర్షణను నొక్కి చెబుతోందని సంస్థ ఒక పత్రికా ప్రకటనలో పేర్కొంది.

# టైలరింగ్‌తో మహిళలకు ఉపాధి

### ప్రతి నియోజకవర్గంలో 1,000 మందికి కుట్టుమిషన్లు

### 100 శాతం సబ్సిడీతో పంపిణీ

### బిసి సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్

**హైదరాబాద్, ఏప్రిల్ 26, ప్రభాతవార్త:** రాష్ట్రంలో నైపుణ్యం కలిగిన బీసీ మహి ళలకు టైలరింగ్ ఆధారిత స్వయం ఉపాధి కల్పించాలని రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయించింది. రాష్ట్రంలోని ప్రతి నియోజకవర్గంలో 1000 మంది మహిళలకు 100 శాతం సబ్సిడీతో కుట్టుమిషన్లను ఇవ్వనున్నట్టు బీసీ సంక్షేమం, రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ తెలిపారు. టైలరింగ్ ద్వారా వారి ఉత్పాదకతను పెంచి, వారి వ్యాపార అవకాశాలను విస్తరించుకునేందుకు, స్వయం సమృద్ధిగల పారిశ్రామికవేత్తలుగా ఎదిగేందుకు ఆటోమేటిక్ కుట్టు యంత్రాలను సరఫరా చేయాలని బీసీ సంక్షేమ శాఖ ఉత్తర్వులు జారీ చేసింది. ఈ పథకం అమలుపై బీసీ సంక్షేమ శాఖ సెక్రటరీ బాలమయాదేవి, బీసీ కార్పొరేషన్ ఎండీ మల్లయ్య బట్టుతోపాటు ఇతర అధికారులతో మంత్రి పొన్నం ప్రభాకర్ సమీక్షా సమావేశం నిర్వహించారు.

ఈసందర్భంగా మంత్రి పొన్నం ప్రభాకర్ మాట్లాడుతూ.. తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం బలహీన వర్గాల పక్షాన మహిళలకు స్వయం ఉపాధి కల్పించడానికి ప్రతి నియోజకవర్గానికి 1000 మంది మహిళలకు కుట్టు మిషన్లు 100 శాతం సబ్సిడీతో మంజూరు చేయాలని ప్రభుత్వం నిర్ణయిం చిందన్నారు. త్వరలోనే వాటికి అప్లికేషన్ తీసుకొని జిల్లా కలెక్టర్ల ఆధ్వర్యంలో ఎంపిక ప్రక్రియ జరుగుతుందన్నారు. ముఖ్యమంత్రి సూచన మేరకు బలహీన వర్గాల మహిళలకు ఉపాధి అవకాశాలు మెరుగుపరచడానికి ఈ నిర్ణయం తీసుకోవడం జరిగిందన్నారు. నియోజకవర్గానికి వెయ్యి మంది మహిళలు స్వయం ఉపాధి పెంచుకొని ఆర్థికంగా ఆసరాగా ఎదగడానికి ఉపయోగ పడుతుందన్నారు. బలహీనవర్గాల శాఖ పక్షాన నిరుద్యోగులకు ఉపాధి అవకాశాలు పెంచడంతోపాటు, స్కిల్ డెవలప్‌మెంట్ వంటి కార్యక్రమాలు చేయడానికి శాఖ ప్రణాళికలు చేస్తుందని మంత్రి పొన్నం ప్రభాకర్ తెలిపారు.

## ఆత్మగౌరవ పదం ఉచ్చరించడానికి కవిత అనర్హురాలు

### అధికారం పోయాక బిఆర్‌ఎస్‌ను విమర్శించినా నమ్మరు

### రాష్ట్ర మహిళా ప్రదేశ్ కాంగ్రెస్ అధ్యక్షురాలు ఎర్రబెల్లి స్వర్ణ

**హైదరాబాద్, ఏప్రిల్ 26, ప్రభాతవార్త:** మద్యం వ్యాపారంలో తలదూర్చిన కవిత ఆత్మగౌరం పదం ఉచ్చరించడానికి కూడా అనర్హురాలని పదేళ్ల బిఆర్‌ఎస్ పాలనలోని పాపాలను అప్పుడే ప్రశ్నించి ఉంటె కవితను తెలంగాణ ప్రజలు నమ్మేవారనీ తెలంగాణ రాష్ట్ర మహిళా కాంగ్రెస్ అధ్యక్షురాలు ఎర్రబెల్లి స్వర్ణ అన్నారు. గాంధీభవన్‌లో ఆదివారం మీడియాతో మాట్లాడుతూ దోపిడి పాలన చేసింది ఎవరో తెలంగాణ పల్లెల్లో ఎవరిని అడిగినా చెప్తారనీ ఎద్దేవా చేశారు. రేవంత్ రెడ్డి పాలనను రాక్షస పాలన అంటున్న కవితకు, ఎవరు రాక్షస పాలన చేశారో తెలియదా? దోచుకున్న డబ్బులో వాటా దొరక్కపోతే ఇప్పుడు వచ్చి తెలంగాణ సెంటిమెంట్ ను వాడుకుంటున్న విషయాన్ని ప్రజలు గమనిస్తున్నారనీ వ్యాఖ్యానించారు. పదేళ్లలో తెలంగాణను దోచుకుని సర్వనాశనం వారు చేసిన వాళ్లు, ఇప్పుడు ఆ పాపాలకు, కేసులు నమోదు అవుతుండడంతో మరోసారి ఆత్మగౌరవం, తెలంగాణ సెంటిమెంట్ వాడుకుంటు న్నారనీ ఆగ్రహం వ్యక్తంచేశారు. గతంలో మా నాన్న కంటే రేవంత్ రెడ్డి బాగా పాలన చేస్తున్నారని అన్న నీ నోటితోనే, మళ్లీ రేవంత్ రెడ్డి రాక్షస పాలన సాగిస్తున్నారని అనడం నీ విజ్ఞతకే వదిలేస్తున్నా అని అన్నారు.

చట్టం తన పని తాను చేసుకుపోతుందని చెప్పే నువ్వు, తెలంగాణ ఆత్మగౌరవం గురించి మాట్లాడే హక్కు నీకు లేదు అని అన్నారు. ఇతర రాష్ట్రాల మద్యం వ్యాపా రాల్లో తలదూర్చిన మీకు ఆత్మగౌరవం ఉందా? అని ప్రశ్నించారు. ఉద్యమకారుల త్యాగాల మీద ఏర్పడ్డ తెలంగాణ రాష్ట్రంలో, ఒకే కుటుంబానికి అన్ని పదవులు దక్కడం ఏ రకమైన సామాజిక న్యాయం? అని అడిగారు అధికారంలో ఉన్నప్పుడు నీకు సామాజిక న్యాయం గుర్తుకు రాలేదనీ విమర్శించారు.

రాష్ట్రంలో సాధారణ కార్యకర్తలకు రాని అవకాశాలు, కేవలం కల్వకుంట్ల అనే పేరున్నందుకే మీకు దక్కుతున్నాయన్నది నిజం కాదా? అని అడిగారు. ఇదేనా మీ సామాజిక న్యాయం? అని ఎద్దేవా చేశారు. మీ ప్రభుత్వం హయాంలో మహిళలపై జరుగుతున్న అన్యాయాలపై స్పందించని నువ్వు, జాతీయ స్థాయిలో మహిళా హక్కుల గురించి మాట్లాడటం విడ్డూరంగా ఉందనీ అన్నారు. మీ మీద వచ్చే అవినీతి ఆరోపణలను తెలంగాణ సమాజంపై దాడిగా చిత్రీకరించడం ఆపండనీ చెప్పారు. ఆరోపణలు మీ వ్యక్తిగత వ్యాపారాలకు సంబంధించినవి, తెలంగాణ ప్రజలకు సంబంధించినవి కావని హితవు చెప్పారు.

## ఎమ్మెల్యే యశస్విని ఫిర్యాదుపై కాంగ్రెస్ నేతలు హరిప్రసాద్, కృష్ణకిషోర్‌కు నోటీసులు

### రేవంత్‌ను విమర్శించే నైతికత కవితకు లేదు

### ఆర్టీసీ కార్మికులకు అన్యాయం జరగనీయం : మల్లు రవి




ఆదివారం గాంధీభవన్‌లో మాట్లాడుతున్న పిసిసి క్రమశిక్షణ కమిటీ చైర్మన్ మల్లు రవి

**హైదరాబాద్, ఏప్రిల్ 26, ప్రభాతవార్త:** మున్సిపల్ ఎన్నికలలో పార్టీకి వ్యతిరేకంగా పనిచేసిన కాంగ్రెస్ నాయకులు హరిప్రసాద్, కృష్ణకిషోర్‌లకు నోటీసులు జారీచేసినట్లు పిసిసి క్రమశిక్షణ కమిటీ చైర్మన్ మల్లు రవి తెలిపారు. ఎమ్మెల్యే యశస్విని రెడ్డి, కాంగ్రెస్ పార్టీ ఇన్‌చార్జి ఝాన్సీ రెడ్డి చేసిన ఫిర్యాదు మేరకు పిసిసి క్రమశిక్షణ కమిటీ చైర్మన్ మల్లు రవి ఆధ్వర్యంలో ఆదివారం గాంధీభవన్‌లో సమావేశమయ్యారు. మున్సిపల్ ఎన్నికల్లో పాలకుర్తి నియోజకవర్గ పరిధిలో కాంగ్రెస్ పార్టీకి వ్యతిరేకంగా హరిప్రసాద్, కృష్ణ కిశోర్ పని చేశారని పాలకుర్తి ఎమ్మెల్యే యశస్విని, పార్టీ ఇన్‌చార్జి ఝాన్సీ రెడ్డి ఫిర్యాదు చేశారు. నోటీసులు అందుకొన్న కృష్ణ కిషోర్ అమెరికాలో ఉన్నానని చెప్పారనీ మల్లురవి వివరించారు, హరి ప్రసాద్ ఇంట్లో ఫంక్షన్ ఉందనీ అని లేక రాశాడనీ రవి చెప్పారు. హరి,కృష్ణ ఇద్దరు పది రోజుల్లో వివరణ ఇవ్వాలని మళ్లీ షోకాజ్ నోటీసులు ఇస్తామనీ చెప్పారు. బాధ్యత గల పదవుల్లో ఉన్న వ్యక్తులు పార్టీకి ఇబ్బంది కలిగే విధంగా మీడియాలో మాట్లాడుతున్నారనీ ఆగ్రహం వ్యక్తం చేశారు. ఎవరికి వారే ఇష్టమొచ్చినట్లు మాట్లాడితే పార్టీకి నష్టం జరుగుతుందని హితవు చెప్పారు. ఆ విషయాలపై సుమోటోగా చర్చించామనీ ఎవరికైనా ఇబ్బందులు కలిగితే పిసిసి అధ్యక్షుడు, ఇన్చార్జ్ మీనాక్షి నటరాజన్, ప్రభుత్వ పరంగా సిఎం రేవంత్ రెడ్డి దృష్టికి తీసుకెళ్లాలనీ కోరారు.ఆర్టీసీ కార్మికుల డిమాండ్లు అన్ని పరిష్కరించాంప్రజా ప్రభుత్వంలో కార్మికులకు అన్యాయం జరగనీ యమనీ, కార్మికుడు చనిపోవడం దురదృష్ట కరమనీ ఆవేదన చెందారు.

ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి కర్కోటకుడు, తెలంగాణలో హిట్లర్ పరిపాలన జరుగుతుందని కవిత అన్న వ్యాఖ్యలు ఖండిస్తు న్నామనీ ఆయన ఆగ్రహం వ్యక్తం చేశారు. తెలంగాణలో రామరాజ్యం నడుస్తుంటే కవితకు ఏ రకంగా హిట్లర్ రాజ్యం కనిపిస్తుందనీ కవిత ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డిపై చేసిన మాటలను విత్ డ్రా చేసుకొని ప్రజల్లోకి పోవాలని హితవు చెప్పారు. కవిత మీటింగ్ కు వచ్చిన ప్రజలను అడిగితే తెలుస్తుంది కవిత పార్టీ పెట్టుకునే హక్కు ఆమెకు ఉంది. తండ్రీబిడ్డలు ఏమైనా మాట్లాడు కోవచ్చు కానీ ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డిని, కాంగ్రెస్‌ను విమర్శించే హక్కు కవితకు లేదన్నారు. బిఆర్‌ఎస్‌లో పదేళ్లు కీలక పదవులు అనుభవిం చిందనీ, లిక్కర్ కేసులో అరెస్ట్ అయి జైలుకు పోయినప్పుడు బిఆర్‌ఎస్ వాళ్లు సరిగా స్పందించ లేదని, ఆమె బయటకు వచ్చిందనీ అన్నారు. పది సంవత్సరాలు అధికారంలో ఉండి మహిళలకు ఉచిత బస్ ప్రయాణం ఎందుకు కల్పించలేదనీ అడిగారు. మేము ఉచిత బస్ ప్రయాణం కల్పి స్తున్నామనీ, మీరు ముక్క బియ్యం ఇచ్చారనీ విమ ర్శించారు. మేము సన్న బియ్యం ఇస్తున్నామనీ మీ క్యాబినెట్ లో మహిళలకు ఎందుకు చోటు కల్పించలేదని మీ తండ్రిని ఎందుకు ప్రశ్నించలేదని అడి గారు. మీరు అధికారంలోకి వచ్చాక తెలంగాణను 50 యేళ్లు వెనక్కి తీసుకపోయారని ఆవేదన చెందారు.

## తెలంగాణ సారస్వత పరిషత్తు సాహిత్య పురస్కారాలు

**హైదరాబాద్ (నాంపల్లి), ఏప్రిల్ 26, ప్రభాతవార్త :** ఉభయ తెలుగు రాష్ట్రాలల్లో బాలసాహిత్య వికాసానికి రచయితలుగా, ఉపాధ్యాయులుగా విశేషకృషిచేస్తున్న ఇరు రాష్ట్రాలకు చెందిన 20మందికి తెలంగాణ సారస్వత పరిషత్తు ప్రతిష్టాత్మక బాలసాహిత్యమూర్తి, బాలసాహితీ మిత్ర పురస్కారాలు ప్రకటించింది.

బాలసాహితీ మూర్తి పురస్కారాలకు ఎంపికైన బాలసాహితీ వేత్తలు : డా. వి.ఆర్.శర్మ, యు.విజయ శేఖర్ రెడ్డి, ఎడ్ల లక్ష్మి, ఎం.కృష్ణకుమారి, జొన్నలగడ్డ శ్యామల, ఒట్ర ప్రకాశరావు, డా. కె.నారాయణ మూర్తి, డా. జి.సతీష్‌కుమార్, ఎస్. హనుమంత రావు; బాలసాహితీమిత్ర పురస్కారాలు : ఈ.రాఘవేంద్ర, డా. చిట్యాల దేవేంద్రప్ప, బైతి దుర్గయ్య, కోకిల నాగరాజు, ఉంద్రాళ్ల రాజేశం, డా. ఎన్. కిట్టన్న, గుండ్లరాజు, పెరుమాళ్ల ఆనంద్, డా. పొట్టబత్తుల రామకృష్ణ, పసుపులేని నీలిమ, సబ్బతి సుమిత్రాదేవిలు ఉన్నారు. బాలసాహిత్య కృషిని దృష్టిలో పెట్టుకుని ఈ ఎంపిక జరిగినట్లు, వచ్చే నెల 4న తెలంగాణ సారస్వత పరిషత్తులో ఆచార్య ఎల్లూరి శివారెడ్డి అధ్యక్షతన జరిగే సమ్మేళనంలో పద్మ భూషణ్ డా. కె.ఐ.వరప్రసాదరెడ్డి ముఖ్యఅతిథిగా పాల్గొని పురస్కారాలు, పురస్కారంకింద ఒక్కొక్కరికి 5వేల రూపాయల నగదు, జ్ఞాపిక, శాలువాతో ఘనంగా సత్కరిస్తారని పరిషత్తు కార్యదర్శి డా. జె.చెన్నయ్య ఈ ప్రకటనలో తెలిపారు. తెలంగాణ సారస్వత పరిషత్తు కథలపోటీ ఫలితాలు : తెలంగాణ సారస్వత పరిషత్తు పెద్దలకోసం నిర్వహించిన పిల్లల కథల పోటీ ఫలితాలు ప్రకటించారు.

ఉభయ తెలుగు రాష్ట్రాల నుండి 180 కథలు పోటీకి రాగా న్యాయనిర్ణేతలు వాటిని పరిశీలించి ఇరురాష్ట్రాలకు చెందినవారి 10 కథలను బహుమతి ఎంపిక చేసినట్లు పరిషత్తు ప్రధాన కార్యదర్శి డా. జె.చెన్నయ్య తెలిపారు. బహుమతికి ఎంపికైన వారిలో : బి.వి.పట్నాయక్, తమ్మవరపు వెంకటసాయి సుచిత్ర, కోనే నాగవెంకట ఆంజనేయులు, కె.వి.లక్ష్మణరావు, జె.శ్యామల, అనిశెట్టి సతీష్‌కుమార్, జీ.వి. శ్రీనివాస్‌లు రాసిన కథలు ఉన్నాయి. విజేతలకు బహుమతి కింద వెయ్యిరూపాయల నగదు, ప్రశంసాపత్రం, కథ ప్రచురించిన పుస్తకం పంపిస్తామని వివరించారు. వీటితోపాటు మరో 60 కథలు సాధారణ ప్రచురణకు ఎంపిక య్యాయని, వాటినీ సంకలనంగా ప్రచురించి వచ్చేనెల నాలుగవ తేదీన జరిగే బాలసాహిత్య సమ్మేళనంలో బహుమతుల ప్రదానంతోపాటు ప్రచురణలు ఆవిష్కరింపచడం జరుగుతుందని చెన్నయ్య వెల్లడించారు.

## ప్రజాచైతన్యస్ఫూర్తి కె.వి.రమణాచారి

### ప్రముఖ సాహితీవేత్త డా. వల్లూరి శ్రీరామచంద్రమూర్తి ప్రశంస

### రమణాచారికి నండూరి రామకృష్ణమాచార్య పురస్కారం ప్రదానం



నండూరి రామకృష్ణమాచార్య స్మారక పురస్కారంతో కె.వి.రమణాచారిని సత్కరిస్తున్న శ్రీరామచంద్రమూర్తి, ఫణీంద్ర, వి.విజయకుమార్, అనంతపద్మనాభరావు తదితరులు

**హైదరాబాద్ (నాంపల్లి), ఏప్రిల్ 26, ప్రభాతవార్త :** మచ్చలేని మహా వ్యక్తిత్వమున్న పరిపాలనాధికారి, మనసున్న ఐఎఎస్ అధికారి, సాహితీ సాంస్కృతికబంధు డా. కె.వి.రమణాచారి అని సుప్రసిద్ధ సాహితీవేత్త డా. వల్లూరి శ్రీరామచంద్రమూర్తి అన్నారు. ఐఎఎస్ అధికారిగా స్వచ్ఛంద పదవీ విరమణ చేసిన అనంతరం కూడా ఒక క్యాంపు కార్యాలయాన్ని ఏర్పాటుచేసి ప్రజల్లో చైతన్యం తీసుకొస్తూ ఏకకాలంలో ప్రజల నుండి చైతన్యాన్ని పొందడం విశేషమని ప్రశంసించారు. నండూరి రామకృష్ణమాచార్య సాహిత్యపీఠం, నవ్య సాహితీ సమితి సంయుక్త ఆధ్వర్యంలో ప్రముఖకవి డా. ఆచార్య ఫణీంద్ర సభాధ్యక్షతన ఆదివారం రాత్రి శ్రీకృష్ణదేవరాయ తెలుగు భాషానిలయంలోని రావిచెట్టు రంగారావు కళావేదికలో మహాకవి డా. నండూరి రామకృష్ణమాచార్య 106వ జయంతి ఉత్సవం నేత్రపర్వంగా జరిగింది. సమితి కార్యనిర్వాహక అధ్యక్షుడు వేమరాజు విజయకుమార్ సభకు స్వాగతం పలికి కార్యక్రమ నేపథ్యాన్ని వివరించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా విచ్చేసిన వల్లూరి శ్రీరామచంద్రమూర్తి గౌరవ అతిథులు దూరదర్శన్ పూర్వ అదనపు డైరెక్టర్ జనరల్ డా. రేవూరి అనంత పద్మనాభరావు, తెలంగాణ రాష్ట్ర ఖజానా, లెక్కలశాఖ డిప్యూటీ డైరెక్టర్ జి.వసుంధర, ఆత్మకూరి గాంధీ, ఆచార్య టి.గౌరీశంకర్, వి.విజయకుమార్ తదితరులతో కలిసి డా. నండూరి రామకృష్ణమాచార్య చిత్రపటానికి పూల మాలవేసి కార్యక్రమాన్ని ప్రారంభించారు. అనం తరం డా. కె.వి. రమణాచారిని ఘనంగా సత్కరించి నండూరి రామకృష్ణమాచార్య స్మారక పురస్కారం ప్రదానంచేశారు. ఆంధ్ర సాహిత్యానికి మూలపురుషుడు, గొప్ప ప్రతిభామూర్తి, ఎవరికీ తలవంచని ధీశాలి, నండూరి రామచృష్ణమాచార్య అని కొనియాడారు.

## ఆర్టీసీ కార్మికుల సమస్యల పరిష్కారంపై చరిత్రాత్మక నిర్ణయం

### మంత్రి వివేక్ వెంకటస్వామికి జెఎసి నేతల కృతజ్ఞతలు

**హైదరాబాద్, ఏప్రిల్ 26, ప్రభాతవార్త:** ఆర్‌టిసి కార్మికులకు ప్రభుత్వం అండగా ఉంటోందని గుర్తింపు కార్మిక సంఘం ఏర్పాటు కోసం త్వరలోనే ఎన్నికలు నిర్వహిస్తామని రాష్ట్ర కార్మిక, ఉపాధి గనుల శాఖ మంత్రి డా. జి వివేక్ వెంకటస్వామి తెలిపారు. ఆర్టీసీ కార్మికుల సమస్యలను పరిష్కరించే దిశగా ప్రభుత్వం చారిత్రాత్మక నిర్ణయాలు తీసుకున్న నేపథ్యంలో, ఆర్టీసీ జెఎసి నేతలు రాష్ట్ర కార్మిక, ఉపాధి గనుల శాఖ మంత్రి డా. జి వివేక్ వెంకటస్వామి ఆదివారం నివాసంలో కలిసి సత్కరించి తమ కృతజ్ఞతలు తెలిపారు. ప్రభుత్వం తీసుకున్న ఈ నిర్ణయాల ద్వారా ప్రజా రవాణా వ్యవస్థ మరింత బలపడుతుందని, అదే ఉత్సాహంతో కార్మికులు సేవలు అందించాలని సూచించారు. ఆర్‌టిసిని ప్రభు త్వంలో విలీనం చేయడం ద్వారా కాంగ్రెస్ ప్రభుత్వం కార్మికుల చిరకాల స్వప్నాన్ని నెరవేర్చిందని అన్నారు. అలాగే గుర్తింపు సంఘాల ఎన్నికల నిర్వ హణ, ఆర్టీసీ కార్మికులకు 11 శాతం పిఆర్‌సి ప్రకటించడం వంటి కీలక నిర్ణయాలపై హర్షం వ్యక్తం చేశారు.ఈ సందర్భంగా ఆర్టీసీ కార్మిక సంఘాల నేతలు వెంకన్న, థామస్‌రెడ్డి, అశ్వద్ధామ రెడ్డి, హనుమంతు ముదిరాజ్ తదితరులు ప్రభుత్వానికి ధన్యవాదాలు తెలిపారు.

## మహిళలకు నాలుగు సోలార్ పవర్ ప్లాంట్లు

### ఖమ్మం, కొత్తగూడెం జిల్లాల్లో పైలట్ కార్యక్రమం

**హైదరాబాద్, ఏప్రిల్ 26, ప్రభాతవార్త:** రాష్ట్ర ప్రభుత్వం ఇందిరా మహిళా శక్తి పథకం కింద సౌర విద్యుత్ ప్రాజెక్టులను ప్రోత్సహిస్తోంది. ఇందులో భాగంగా ఖమ్మం, భద్రాద్రి కొత్తగూడెం జిల్లాల్లోని మహిళలు యూనిగా ఏర్పడి సూక్ష్మ పరిశ్రమల నుండి మెగావాట్ స్థాయి వెంచర్ల వైపు అడుగులు వేయడానికి సిద్ధమవుతున్నాయి. రాష్ట్ర మంత్రివర్గం ఆమోదించిన పైలట్ కార్యక్రమం కింద, ఖమ్మం జిల్లాలోని ఎర్రపాలెం, కల్లూరు మండలాల్లోను, కొత్తగూడెం జిల్లాలోని మనూగూరు, సుజాతనగర్ మండలాల్లో ఒక్కొక్కటి 1 మెగావాట్ సామర్థ్యం గల నాలుగు సౌర విద్యుత్ ప్లాంట్లను ఏర్పాటు చేయనున్నారు. ప్రతి ప్లాంటు కోసం నాలుగు ఎకరాల ప్రభుత్వ భూమిని గుర్తించి కేటాయించారు. ప్రతి 1 మెగావాట్ యూనిట్ రోజుకు సుమారు 4,500 యూనిట్ల విద్యుత్‌ను ఉత్పత్తి చేస్తుందని అంచనా. ఈ విద్యుత్‌ను యూనిట్‌కు రూ.3.13 అందిస్తుండటంతో, రోజువారీ ఆదాయం రూ.14,095గా అంచనా వేయబడింది, దీని ద్వారా మహిళలకు నెలకు సుమారు రూ.1,00,020 ఆదాయం లభిస్తుందని అధికారవర్గాలు వెల్లడించాయి. ఆర్థిక నమూనా ప్రకారం, ప్రాజెక్ట్ వ్యయంలో 20 శాతం నిధులను బ్యాంకు రుణాల ద్వారా సమకూరుస్తారు. రుణాల చెల్లింపుల తర్వాత, ఈ మహిళలకు నెలకు సుమారుగా రూ.47,020 నికర ఆదాయాన్ని ఆర్జించగలవని అంచనా. 25 సంవత్సరాల ఒప్పంద కాలంలో 12 సంవత్సరాలలోపు రుణాలను తీర్చేయడం ద్వారా, మిగిలిన 13 సంవత్సరాల పాటు గ్రూపులు పూర్తి లాభాలను ఆర్జించగలవని విద్యుత్ శాఖ వర్గాలు భావిస్తున్నాయి. కాగా ఎర్రపాలెం మండలం, రాజూపాలెం గ్రామంలో మహిళల నిర్వహణలో ఒక ప్లాంటు నిర్మాణం పూర్తి కావస్తోంది. నాలుగు ఎకరాల్లో రూ.2.9 కోట్ల వ్యయంతో నిర్మించిన ఈ ప్రాజెక్టుకు 90 శాతం బ్యాంకు రుణాలు, 10 శాతం బృందాల వాటాతో నిధులు సమకూర్చుతున్నారు. త్వరలోనే విద్యుత్ ఉత్పత్తి ప్రారంభమవుతుందని అధికారులు చెబుతున్నారు. ఇక కల్లూరు మండలం చిన్నకోరుకొండి గ్రామంలో పనులు కొనసాగుతున్నాయని, మణుగూరు, సుజాతనగర్ మండలాల్లో త్వరలో నిర్మాణాలు చేపట్టనున్నట్లు అధికారులు తెలిపారు.

## దిగివస్తున్న చికెన్ ధరలు

**హైదరాబాద్, ఏప్రిల్ 26, ప్రభాతవార్త:** ఇటీవల భారీగా పెరిగిన చికెన్ ధరలు ప్రస్తుతం దిగివస్తున్నాయి. గత మార్చిలో ఏకంగా కిలో చికెన్ ధర 400 వరకు పెరగ్గా కొద్ది రోజులుగా తగ్గుముఖం పడుతున్నాయి. ప్రస్తుతం రాష్ట్రంలో చికెన్ ధరలు భారీగా పడిపోయాయి. తెలంగాణలో ఆదివారం లైవ్ బర్డ్ ఫామ్ ధర కెజి రూ.105గా నమోదైంది. ఇక రిటైల్ ధర రూ.132కు పడిపోయింది. గత వారంతో పోలిస్తే చికెన్ ధర కిలోకు రూ.40 వరకు ధర తగ్గింది. కొంతకాలంగా మండిపోతున్న చికెన్ ధరలతో బెంబేలెత్తిన సామాన్యులు ధరలు తగ్గడంతో సంతోషం వ్యక్తం చేస్తున్నారు. ఇక డ్రెస్డ్ చికెన్ ధర కిలోకు రూ. 191 నుంచి రూ. 220 మధ్యన ఉండగా..స్కిన్‌లెస్ చికెన్ ధర కిలోకు రూ. 218 నుంచి రూ. 230 వరకు ఉంది. ముఖ్యంగా హైదరాబాద్ నగరంలో కిలో చికెన్ ధర రూ. 260 నుంచి రూ. 280 వరకు పలుకుతోంది. అయితే చికెన్ ధరలు సామాన్యుడికి అందుబాటులోకి వచ్చినప్పటికీ, మటన్ ధర మాత్రం దిగిరావడం లేదు. ప్రాంతాన్ని బట్టి మార్కెట్‌లో కిలో మటన్ ధర రూ. 900 నుంచి రూ. 1000 వరకు పలుకుతోంది. ఇకపోతే రిటైల్ మార్కెట్‌లో డజను గుడ్ల ధర రూ. 72గా నమోదైంది. అయితే రాష్ట్రాల్లో ఎండల తీవ్రత అంతకంతకూ పెరుగుతున్న నేపథ్యంలో కోళ్ల పెంపకం, వినియోగంపై ఆ ప్రభావం స్పష్టంగా కనిపిస్తోందని మార్కెట్ వర్గాలు విశ్లేషిస్తున్నాయి. పెరుగుతున్న ఉష్ణోగ్రతల దృష్ట్యా రాబోయే రోజుల్లోనూ చికెన్ ధరలు మున్ముందు కూడా తక్కువగానే, ఇదే తరహాలో కొనసాగే అవకాశం ఉందని కోళ్ల ఫామ్ వ్యాపార నిపుణులు అంచనా వేస్తున్నారు.

## రేవంత్‌రెడ్డి హిట్లర్ కాదు.. హిస్టరీ మేకర్

### మహిళా కాంగ్రెస్ రాష్ట్ర ఉపాధ్యక్షురాలు రేఖ

**హైదరాబాద్ ఏప్రిల్ 26, ప్రభాతవార్త :** ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డిపై టిఆర్‌ఎస్ నేత కల్వకుంట్ల కవిత చేసిన విమర్శలకు తెలంగాణ ప్రదేశ్ మహిళా కాంగ్రెస్ ఉపాధ్యక్షురాలు డాక్టర్ రేఖ బోయలపల్లి ఘాటుగా స్పందించారు. రేవంత్‌రెడ్డి హిట్లర్ కాదని,స్థానిక ఎన్నికల్లో 42 బీసీ రిజర్వేషన్ ఇచ్చి ప్రజల కోసం పనిచేస్తున్న హిస్టరీ మేకర్ అని ఆమె పేర్కొన్నారు.కాంగ్రెస్ ప్రభుత్వం ప్రవేశపెట్టిన బడ్జెట్‌లో సంక్షేమానికి పెద్దపీట వేయడం జరిగిందన్నారు. వ్యవసాయానికి ఎకరాకు రూ.12వేల చొప్పున రూ.24వేల కోట్లకు పైగా రైతు భరోసా పథకానికి,మహాలక్ష్మి పథకానికి రూ.4,305 కోట్లు, మహిళా శక్తి మిషన్‌కు రూ.2,500 కోట్లు, కళ్యాణ లక్ష్మి, షాదీ ముబారక్‌కు రూ.3,683 కోట్లు,విద్యా రంగానికి రూ.26,674 కోట్లు, మహిళా యూనివర్సిటీకి రూ.400 కోట్లు,సేఫ్ సిటీ ప్రాజెక్ట్‌కు రూ.100 కోట్లు కాంగ్రెస్ సర్కార్ కేటాయించిందని పేర్కొన్నారు.

రూ.2 లక్షల వరకు రైతు రుణమాఫీ,మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం, రూ.57,000 కోట్ల వడ్డీ లేని రుణాలు,ఇంటిగ్రేటెడ్ స్కూల్స్ ద్వారా నాణ్యమైన విద్య ప్రభుత్వం అందిస్తుందన్నారు. ఇవి నియంతృత్వ పాలన లక్షణాలు కాదని,ప్రజా పాలనకు నిదర్శనం అని ఆమె పేర్కొన్నారు. తెలంగాణ సమాజం చైతన్యవంతమైందని, ప్రజలు మాటలు కాదని,మార్పు చూస్తున్నారని, సంక్షేమం-అభివృద్ధితో తెలంగాణ కొత్త దిశగా సాగుతోందని రేఖా గుర్తు చేశారు.

## ఎస్సీ, ఎస్టీ యువతకు బ్యాంకు పరీక్షలకు శిక్షణ

### దరఖాస్తులకు 28 చివరి తేదీ

**హైదరాబాద్, ఏప్రిల్ 26, ప్రభాతవార్త :** సంక్షేమ వర్గాలకు చెందిన నిరుద్యోగ యువతకు వివిధ పోటీ పరీక్షలకు శిక్షణ ఇస్తున్న గిరిజన సంక్షేమ శాఖ ఇప్పుడు మరో గుడ్ న్యూస్ చెప్పింది. రాష్ట్రంలోని బ్యాంకింగ్ రంగంలో స్థిరపడాలని ఆశించే సాంఘిక, గిరిజన వర్గాల యువతకు ఇన్స్టిట్యూట్ ఆఫ్ బ్యాంకింగ్ పర్సనల్ సెలక్షన్ (ఐబీపీఎస్) పరీక్షలకు గిరిజన సంక్షేమశాఖ ఆధ్వర్యంలో ఉచిత శిక్షణ ఇవ్వనున్నారు. దేశంలోని వివిధ బ్యాంకులు, ఆర్థిక సంస్థలలో సిబ్బందిని అంచనా వేయడానికి, ఎంపిక చేయడానికి, నియమించడానికి స్థాపించబడిన ఒక స్వయం ప్రతిపత్తి గల సంస్థ అయిన ఇన్స్టిట్యూట్ ఆఫ్ బ్యాంకింగ్ పర్సనల్ సెలక్షన్ ప్రధానంగా పిఒ, క్లర్క్, స్పెషలిస్ట్ ఆఫీసర్ పదవుల కోసం పరీక్షలను నిర్వహిస్తుంది. ఈ నేపథ్యంలో ఎస్సీ, ఎస్టీ వర్గాల యువతకు బ్యాంకింగ్ రంగంలో శిక్షణ ఇవ్వాలని నిర్ణయించింది. ఈ మేరకు దీనికి సంబంధించి గిరిజన సంక్షేమశాఖ అధికారులు తెలిపిన వివరాల ప్రకారం డిగ్రీలో మెరిట్ ఆధారంగా ఎస్టీలకు 75 శాతం, ఎస్సీలకు 15 శాతం, బీసీలకు 10 శాతం చొప్పున మొత్తం 100 మంది అభ్యర్థులను ఎంపిక చేసి శిక్షణ ఇవ్వనున్నట్టు తెలిపింది. ఆసక్తి ఉన్న అభ్యర్థులు ఈ నెల 28వ తేదీలోగా వెబ్‌సైట్ ద్వారా దరఖాస్తులు సమర్పించాలని గిరిజన సంక్షేమ శాఖ పేర్కొంది

